క్లుప్తంగా

నేడు అయోధ్య అక్షింతలు ఊరేగింపు

తిరుపతి కల్చరల్: అయోధ్యలో నిర్మాణం జరుగుతున్న శ్రీరాముని దివ్యభవ్య మందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో అయోధ్యలోని బలరాముని పూజలో ఉపయోగించిన అక్షింతలు, రామాలయ చిత్రపటం శుక్రవారం తిరుపతికి చేరుకోనుండడంతో ఊరేగింపు చేపడుతున్నట్లు వీహెచ్‌పీ జిల్లా సహకార్యదర్శి రమాదేవి, నగర అధ్యక్షుడు డి.నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. జై శ్రీరామ్ నినాదాల నడుమ మేళతాళాల మధ్య శ్రీకోదండరామాలయం నుంచి కొత్తవీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయం వరకు సాయంత్రం 6 గంటలకు అయోధ్య రాముని అక్షింతల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

భారతీయజ్ఞానం విజ్ఞాన భాండాగారం

తిరుపతి సిటీ: భారతీయ జ్ఞానం విజ్ఞాన భాండాగారమని ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ వీసీ ఆచార్య శాంతిశ్రీ పేర్కొన్నారు. గురువారం స్థానిక వేదిక్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యావ్యవస్థకు ఆదర్శప్రాయులని పేర్కొన్నారు. త్వరలో ఆధునిక విజ్ఞానంతో వేద విజ్ఞానాన్ని సమన్వయం చేసుకొని ఒప్పందం చేసుకుంటామని తెలియజేశారు. వేదిక్ వీసీ రాణి సదాశివమూర్తి, ఎస్వీయూ ప్రొఫెసర్ రామిరెడ్డి, రిజిస్ట్రార్ రాధేశ్యామ్, పీఆర్‌ఓ బ్రహ్మాచార్య పాల్గొన్నారు.

రక్తదానంపై విద్యార్థులకు అవగాహన

తిరుపతి సిటీ: మహిళా వర్సిటీలో మహిళ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు గురువారం రక్తదానం ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.రాణి మాట్లాడుతూ రక్తదానం మరో ప్రాణాన్ని కాపాడుతుందని ప్రతి విద్యార్థి రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ సమాజంలో యువత సామాజిక సేవకు అంకితం కావాలని సూచించారు. మహిళ అధ్యయన కేంద్రం రీసెర్చి అసిస్టెంట్ ప్రీతి, ఇంద్రాణి, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాలల సైన్స్ ఫెస్టివల్

తిరుపతి కల్చరల్: రీజనల్ సైన్స్ సెంటర్‌లో తిరుపతి బాలోత్సవం వారి సహకారంతో బాలల దినోత్సవంలో భాగంగా శుక్ర, శనివారం రెండు రోజులు బాలల సైన్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బాలల సైన్స్ ఫెస్టివల్‌ను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించి విద్యార్థులతో సైన్స్ ఫెయిర్, సైన్స్ డ్రామా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 18వ తేదీ శనివారం సైన్స్ ఫెస్టివల్‌లో విజేతలుగా ఎంపికైన విద్యార్థులకు టీటీడీ డీఈవో ఎం.భాస్కర్‌రెడ్డితో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన ముఖ్యం



అవగాహన కల్పిస్తున్న సీఎస్‌సీ టెలీ లా సర్వీసెస్ సిబ్బంది

తిరుపతి అర్బన్: చట్టాలపై అవగాహన ముఖ్యమని సీఎస్‌సీ అధికార ప్రతినిధి ప్రశాంత్ తెలిపారు. గురువారం తిరుపతి నగరంలోని గాలివీధి రాస్ భవనంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ, సామాజిక సమస్యలను పరిష్కరించుకునేందుకు చట్టాన్ని ఆశ్రయించాలని తెలిపారు. ప్రజలకు చట్టాలపై అవగాహన పెంచేందుకు మినిస్ట్రీ ఆఫ్ జస్టిస్ టెలీ లా సౌకర్యాన్ని కల్పిస్తోందన్నారు. ప్రజలకు సీఎస్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్యానల్ న్యాయవాది అబ్దుల్, రాస్ సంస్థ ఆనిమేటర్ రజని, లీలా కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



ధర్నా చేస్తున్న బ్యాంక్ ఉద్యోగ సంఘం నేతలు

తిరుపతి అర్బన్: ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడానికి శాశ్వత ఉద్యోగులను తీసుకోవాలని బ్యాంక్ తిరుపతి బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ కమిటీ ప్రధాన కార్యదర్శి ధన్వంత్‌కుమార్, అధ్యక్షుడు విజయభాస్కర్ పేర్కొన్నారు. గురువారం తిరుపతిలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ వద్ద ధర్నా చేపట్టారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోషియేషన్ పిలుపు మేరకు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. ఉద్యోగ సంఘం నేతలు జనార్దన్, భాస్కర్, రేష్మ, సుమలత, నిర్మల, నరసింహులు, లక్ష్మిపతి, యజ్ఞేష్‌బాబు, నందగోపాల్, మహేష్, పవన్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేకుంటే.. జీవితమే లేదు

- ఉద్ఘాటించిన 10, 12వ డివిజన్ల ప్రజలు
- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన
- చంద్రబాబు పాలనలో తిరుపతి అభివృద్ధి శూన్యం
- జగనన్న పాలనలో రూ.1600 కోట్లతో తిరుపతి అభివృద్ధి
- ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన



10వ డివిజన్‌లో సభలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



లక్ష్మీపురం సర్కిల్లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: రాష్ట్రంలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా.. పేదల సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో లేకపోతే తమ లాంటి లక్షలాది మంది పేదలకు జీవితమే లేదని తిరుపతి 10, 12వ డివిజన్‌లోని ప్రజలు చెబుతున్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక తమ జీవితాలకు భరోసా కల్పించారని, సంక్షేమ పథకాలతో సుభిక్షంగా జీవిస్తున్నామని స్థానిక ప్రజలు తెలిపారు. మళ్లీ జగనన్నే మాకు సీఎంగా కావాలని ముక్తకంఠంతో చెప్పారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని 10, 12వ డివిజన్లలో దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కే బాబు, ఎస్‌కే జానీ ఆధ్వర్యంలో గురువారం ‹ఏపీకి జగనే ఎందుకు కావాలంటే› అన్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నిర్వహించారు. 12వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఎగురవేసి, ఆ వార్డులో చేసిన అభివృద్ధితోపాటు ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఫొటోలతో కూడిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జ్ పడమటి కుమార్, ఎస్‌కే జానీతో కలిసి ఇంటింటికి వెళ్లి జగనే మళ్లీ ఎందుకు కావాలన్న అంశాలను స్థానిక ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటే మరింత సంక్షేమం అందిస్తారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగన్నరేళ్లల్లో ఏ నాయకుడు చేయలేనంతగా సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. గత చంద్రబాబు పాలనలో తిరుపతి నియోజకవర్గ అభివృద్ధికి చేసింది ఏమీలేదన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక రూ. 1600కోట్లతో తిరుపతిని అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పెత్తందారుల పక్కన కాకుండా పేదల పక్షాన నిలబడే నాయకుడు జగనన్న అన్నారు. రాష్ట్రంలో రూ. 3.38లక్షల కోట్లు సంక్షేమం రూపంలో పేదలకు అందించామన్నారు. పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్, ఎస్‌కె జానీ, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ఆదం సుధాకర్ రెడ్డి, పడమటి కుమార్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు, కార్పొరేటర్లు దొడ్డారెడ్డి ప్రవల్లికా రెడ్డి, దూదికుమారి, జేసీఎస్ అధ్యక్షుడు దొడ్డారెడ్డి మురళీరెడ్డి, ఉదయగిరి రమేష్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు కడపగుంట అమరనాథ్‌రెడ్డి, వెంకటేష్‌రాయల్, మాకం చంద్రయ్య, పార్టీ నాయకులు తాలూరి ప్రసాద్, రాపూరి ప్రసాద్, కుమార్, మురళి, ఉప్పరపాళెం మధు, మంజునాథ్, జయరామిరెడ్డి, లక్ష్మీపతి, సాకం ప్రభాకర్ పాల్గొన్నారు.



జిల్లా అండర్-14 హాకీ, ఫుట్‌బాల్‌కు ఎంపికైన క్రీడాకారులు

జిల్లా క్రీడా జట్ల ఎంపిక

చంద్రగిరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్–14 స్థాయిలో హాకీ, ఫుట్‌బాల్ జట్ల ఎంపిక కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రగిరి మండల అధ్యక్షుడు హేమేంద్ర కుమార్‌రెడ్డి విచ్చేశారు. విశిష్ట అతిథిగా చంద్రగిరి గ్రామపంచాయతీ సర్పంచ్ రూపా రామమూర్తి పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి విద్యార్థులు, వారి వ్యాయామ ఉపాధ్యాయులు 500 మంది హాజరయ్యారు. వీరందరికి చంద్రగిరి సర్పంచ్ రూపారామమూర్తి పిల్లలకు సిబ్బందికి మధ్యాహ్న భోజన వసతి, తాగునీటి సౌకర్యం కల్పించారు. న్యాయనిర్ణేతల సమక్షంలో పూర్వపు చిత్తూరు జిల్లా జట్ల ఎంపిక చాలా ప్రశాంతంగా జరిగిందని నిర్వాహకులు తెలిపారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు, పాఠశాల విద్యాకమిటీ కో–ఆప్షన్ మెంబర్ హరికుమార్ రెడ్డి, దోర్నకంబాల ఉప సర్పంచ్ మురళిరెడ్డి హాజరయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పాఠశాల పీఈటీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోండి

తిరుపతి కల్చరల్: నాయీబ్రాహ్మణ కులవృత్తిని దోచుకుంటున్న కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని తిరుపతి నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవులపాటి బుజ్జిబాబు విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుపతి నగరంలో నాయీబ్రాహ్మణులు వేలాది మంది తమ కులవృత్తి ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. అయితే కొన్ని కార్పొరేట్ సంస్థలు సెలూన్ పేరుతో నాయీబ్రాహ్మణుల చిన్న చిన్నగా పెట్టుకున్న సెలూన్ షాపులను నిర్వీర్యం చేస్తూ వారి బతుకు భారంగా మారుస్తున్నాయని వాపోయారు. ప్రజాప్రతినిధులు స్పందించి కులవృత్తిని నమ్ముకుని బతుకుతున్న తమకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. నాయీబ్రాహ్మణ కులవృత్తిని దోచుకుంటున్న కార్పొరేట్ సంస్థల శైలిని వ్యతిరేకిస్తూ శుక్రవారం నగరంలోని సెలూన్ షాపులు మూసివేసి భవాని నగర్‌లో నాయీ బ్రాహ్మణులందరూ సమైక్యతతో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు, సెలూన్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

నలుగురికి రిమాండ్

తిరుపతి లీగల్: అధిక మోతాదులో మత్తు పదార్థాలను విక్రయిస్తున్న కేసులో నలుగురికి 15 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి గురువారం ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి రూరల్, అవిలాల చెరువు సమీపంలో కె.పవన్‌కుమార్, శంకర్, ప్రకాష్, హరీష్‌లు మత్తు కలిగించే పదార్థాలను విక్రయిస్తుండగా రూరల్ పోలీసులు వీరిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

ఇద్దరికి జ్యుడిషియల్ కస్టడీ

తిరుపతి వినియోగదారుల కమిషన్ ఇదివరలో ఇచ్చిన తీర్పును అమలు పరచనందుకు ఇద్దరిని జుడిషియల్ కస్టడీకి తరలించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు గురువారం ఆదేశాలు జారీ చేశారు. న్యాయవాది కమిషనర్ ఫిర్యాది సహాయంతో ఇద్దర్నీ అదుపులోకి తీసుకొని కమిషన్ ఎదుట హాజరు పరిచారు. కమిషన్ ఉత్తర్వులను ఇద్దరు గురువారం అమలు చేయలేదు. దీంతో ఇద్దరినీ తిరుపతి సబ్‌జైలుకు గురువారం సాయంత్రం తరలించారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్: దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీన సంకల్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థుల అభినందన సభను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం జీవిత చరిత్రపై శ్రీపద్మావతి బాలికోన్నత పాఠశాలలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. శుక్రవారం జీవకోనలోని విశ్వం పాఠశాలలో వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నట్లు డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు రాజారెడ్డి, షేక్ మహమ్మద్ రఫీ తెలిపారు.

టీడీపీకే భూకుంభకోణాలపై పేటెంట్

- అభివృద్ధి చేసే భూమన కుటుంబంపై అసత్య ఆరోపణలు
- తిరుపతి అభివృద్ధిపై విమర్శలు మానుకోవాలి
- భూమనపై ఆరోపణలకు వైఎస్‌ఆర్‌సీపీ నేతల ఆగ్రహం



మాట్లాడుతున్న వైఎస్‌ఆర్ సీపీ నేతలు

తిరుపతి కల్చరల్: భూ కుంభకోణాలు టీడీపీకి పేటెంట్ మారాయని వైఎస్‌ఆర్ సీపీ నేతలు రామస్వామి వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, వాసుయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ భూమన కుటుంబంపై టీడీపీ నేతలు చేసిన ఆరోపణలను వారు తిప్పి కొట్టారు. నెల్లూరుకు చెందిన టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి తిరుపతిలో భూమన కుటుంబం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కళ్లులేని కబోదిలా పసలేని అసత్యపు ఆరోపణలకు దిగడం సిగ్గుమాలిన చర్య అన్నారు. వడమాల పేట వద్ద 2005లో భూమన అభినయరెడ్డి తన సొంత సొమ్ముతో స్థలం కొనుగోలు చేశారన్నారు. అయితే ఇటీవల వడమాలపేట వద్ద సీఎం జగన్ చొరవతో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి టీటీడీ ఉద్యోగులకు అందని ద్రాక్షగా ఊరిస్తున్న ఇంటి స్థలాల ఆకాంక్షను నెరవేర్చి వారికి భూమి కేటాయించారన్నారు. దీనిని టీటీడీ ఉద్యోగుల ఇంటి స్థలాల భూమి వద్ద భూమన అభినయరెడ్డి భూమిని కొనుగోలు చేశారని అసత్యపు విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. శ్రీనివాస సేతును త్వరగతిన పూర్తి చేసి శ్రీవారి భక్తులకు అందుబాటులోకి తెస్తే కమీషన్లు తీసుకున్నారని మాట్లాడడం టీడీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. నిష్పక్షపాతంగా సామాన్య భక్తుల కోసం పనిచేస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డిని సైతం విమర్శించడం టీడీపీ నేతల అవివేకానికి నిదర్శనమన్నారు. దోచుకోవడం, పంచుకోవడం, దాచుకోవడం మాత్రమే తెలిసిన టీడీపీ నేతలకు మంచి పనులు చేసే సత్తా, దమ్ము లేదన్నారు. తిరుపతి అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న యువనేత భూమన అభినయరెడ్డి అని తెలిపారు. తిరుమల శ్రీవారిని సైతం తమ రాజకీయ స్వార్థానికి వాడుకుంటూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తే రాబోయే ఎన్నికల్లో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని, టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమని స్పష్టం చేశారు. కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి, పసుపులేటి సురేష్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్ల పుల్లయ్య పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

తిరుపతి తుడా: ఇంటింటా చెత్తను తడి, పొడిగా వేరు చేసి సేకరించాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత సూచించారు. బాలాజీ కాలనీలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను గురువారం కమిషనర్ హరిత ఆకస్మిక తనిఖీ చేశారు. చెత్త తరలింపు, ప్రాసెసింగ్ ప్రక్రియను ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్, క్లీన్ తిరుపతి కోసం ప్రజల్లో మరింత చైతన్యం తీసుకువచ్చేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీ ఇంజినీర్ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో జిల్లా క్రీడాకారుల పతకాలు



రాష్ట్ర బాక్సింగ్ పోటీలలో పతకాలు సాధించిన తిరుపతి జిల్లా క్రీడాకారులు

తిరుపతి కల్చరల్: విశాఖపట్నంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగిన ఏడో ఎలైట్ బాక్సింగ్ స్టేట్ ఛాంపియన్‌షిప్ పోటీలలో తిరుపతి జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో పతకాలు కైవసం చేసుకున్నారు. ఈపోటీలలో తిరుపతికి చెందిన కె.శోభ 52 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. 52 నుంచి 54 కేజీల విభాగంలో పి.బేబీక బ్రాంజ్ మెడల్, బాలికల 63–66 కేజీల విభాగంలో ఎస్.సుప్రియ కాంస్య పతకం సాధించారు. అలాగే 57 నుంచి 60కేజీల బాలుర విభాగంలో పి.బాలాజీ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. తిరుపతి ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.ప్రవీణ్, శ్రీధర్ క్రీడాకారులను అభినందించారు.

బాలల దినోత్సవం సంతోషదాయకం

తిరుపతి సిటీ: బాలల దినోత్సవం జరుపుకోవడం సంతోషదాయకమని ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య రాజారెడ్డి పేర్కొన్నారు. గురువారం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అనుబంధంగా హోం సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నడుస్తున్న నర్సరీ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పిల్లల పాటలు, నృత్యాలు, శ్లోక పఠనాలతో అలరించారు. ఆచార్య కుసుమ, మంజుల, ఆచార్య అనురాధ, సుచరిత, స్వరూపరాణి, నీరజ పాల్గొన్నారు. బాలల పాఠశాల టీచర్లు సుదర్శనమ్మ, రాధిక తదితరులు విద్యార్థులకు ఆటపాటలు నేర్పించారు.

గ్రంథాలయాలు.. జ్ఞానాలయాలు



విద్యార్థులకు పలు పుస్తకాలను తెలియజేస్తున్న గ్రంథాలయాధికారులు

తిరుపతి అర్బన్: గ్రంథాలయాలు జ్ఞానాన్ని ప్రసాదించే ఆలయాలని ఎస్వీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్ చంద్రన్ పేర్కొన్నారు. గురువారం తిరుపతి గోవిందరాజులస్వామి ఆలయం సమీపంలోని గ్రంథాలయంలో వారోత్సవాలు చేపట్టారు. తెలుగులో గ్రంథాలయాల కోసం అయ్యంకి వెంకటరమణయ్య ఉద్యమం నడిపి, దానిని వ్యాప్తి చేసి, గ్రంథాలయ పితామహుడిగా పేరొందాడని చెప్పారు. నిత్య జీవితంలో జీవనం సాగించడానికి పరిజ్ఞానం అవసరంగా పేర్కొన్నారు. దాని కోసం గ్రంథాలయాలను సందర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో లైబ్రరీ హెడ్ ఇన్‌చార్జి యం.ప్రశాంత కుమారి, గెజిటెడ్ గ్రంథాలయాధికారి సూర్యనారాయణ మూర్తి, ఆర్ భారతి, కె.సునీల్ బాబు, టి.ప్రతాప్ రెడ్డి, ఎల్.మనిగందన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఇరుముడి పూజలో తుడా చైర్మన్



అయ్యప్ప స్వాములకు వీడ్కోలు పలుకుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి: ధర్మరాజుల ఆలయంలో గురువారం ఉదయం నిర్వహించిన అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజలో తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములతో కలసి ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. తదుపరి శబరిమలైకు వెళ్తున్న స్వాములకు వారి తీర్థయాత్ర సజావుగా సాగాలని కోరారు. చివరగా యాత్రకు వెళ్తున్న భక్తులకు వీడ్కోలు పలికారు. వైఎస్‌ఆర్ సీపీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు మస్తాన్, విరుపాక్షి శంకర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కొత్తపాటి కోటి పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో పనులు పూర్తి చేయండి



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: అభివృద్ధి పనుల్లో ముఖ్యమైన వాటిని గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన పూర్తి చేసేందుకు ఇంజినీర్లు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత సూచించారు. నగరంలో స్మార్ట్ సిటీ, జనరల్ ఫండ్ తదితర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో గురువారం ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ నగరంలో అన్ని వార్డుల్లో ప్రజలకు ఉపయోగకరమైన అభివృద్ధి పనులు చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆయా వార్డుల్లో పర్యటించి ప్రజలకు అవసరమైన రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ తదితరాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, రవీంద్రారెడ్డి, నరేంద్ర, రాజు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవానికి సర్వం సిద్ధం

చంద్రగిరి(తిరుచానూరు): శ్రీపద్మావతి అమ్మవారి వాహనసేవల్లో తలమానికమైనది రథోత్సవం. బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు ఉదయం అమ్మవారు రథోత్సవంలో ప్రసన్నమూర్తిగా భక్తులందరికి దర్శనమిస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 8.40 గంటలకు ధనులగ్నంలో రథోత్సవం ప్రారంభం కానుంది. దీనికోసం టీటీడీ అధికారులు సిబ్బంది సర్వం సిద్ధం చేశారు. రథాన్ని వివిధ కళాఖండాలు, దేవతామూర్తుల ప్రతిమలు, అశ్వాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. రథమండపాన్ని వివిధ పుష్పాలు, చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. రథం సులువుగా తిరిగేందుకు వీలుగా తిరుమాడ వీధుల్లో ఇసుక పరిచారు. రథోత్సవంలో అపశ్రుతి దొర్లకుండా టీటీడీ ఇంజినీరింగ్, విజిలెన్స్, పోలీస్ అధికారులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. మాడవీధుల్లో భక్తుల రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు.

కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన

చంద్రగిరి: రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాల అమలు, పర్యవేక్షణను గురువారం కేంద్ర బృందం పరిశీలించిందని తొండవాడ సర్పంచ్ మల్లం దీపిక చంద్రమౌళిరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వేస్ట్ టు వెల్త్ క్రియేషన్ సెంటర్, హెల్త్ క్లినిక్, సెక్రటేరియట్‌లు, రూరల్ హౌసింగ్, అంగన్‌వాడీ సెంటర్, రైతు భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని తొండవాడ, శానంబట్ల, చిన్న రామాపురం పంచాయతీల్లో కేంద్ర బృందం పర్యటించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ యాత్ర దోహదపడుతుందన్నారు. సింగిల్‌విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, ఈఓపీఆర్డీ శశిరేఖ, పంచాయతీ కార్యదర్శులు నస్రీన్ బేగం, గిరిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పథకాల పనితీరు పరిశీలన

పాకాల: పలు పంచాయతీల్లో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఢిల్లీ బృందం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల పని తీరును పరిశీలించారు. గురువారం వారు పంచాయతీల్లో పర్యటించి ప్రభుత్వం నూతనంగా నిర్మించిన ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, సచివాలయాలు పరిశీలించారు. జెడ్పీటీసీ నంగా పద్మజా రెడ్డి, సర్పంచ్ కస్తూరి, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి, డీఎల్‌పీఓ రూపారాణి పాల్గొన్నారు.

స్వయం సమృద్ధే సహకార బ్యాంకుల లక్ష్యం

రామచంద్రాపురం: స్వయం సమృద్ధే సహకార బ్యాంకుల లక్ష్యమని రాష్ట్ర సహకార బ్యాంకు ఉద్యోగుల సంఘం యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలీ అక్బర్ బాషా, తిరుజిల్లా డీసీఓ శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార బ్యాంకు జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు తక్కువ వడ్డీతో రుణాలు తీసుకుని తమ జీవన స్థితిగతులను మెరుగు పరచుకోవడానికి సహకార సంఘాలు ఎంతగానో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఏఆర్‌లు రమణ నాయుడు, ఝాన్సీ, సహకార విద్యాధికారి సుధాకర్, సీఈఓ కన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మ పరిశోధన స్థానం సందర్శన



మొక్కలను పరిశీలిస్తున్న ఎస్.ప్రసాద్‌రెడ్డి

తిరుపతి సిటీ: డాక్టర్ వైఎస్‌ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న తిరుపతిలోని సిట్రస్ రీసెర్చ్ సెంటర్‌ను గురువారం హార్టికల్చర్ బోర్డ్ చైర్మన్ ఎస్.ప్రసాద్‌రెడ్డి సందర్శించారు. పరిశోధనా కేంద్రంలో పెంచుతున్న స్వీట్ ఆరంజ్, లెమన్ మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ నాగరాజు కేంద్రంలోని స్క్రీన్ హౌజ్, మదర్ ప్లాంట్ బ్లాక్ నిర్వహణ, సీడ్స్ మేనేజ్‌మెంట్, కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలు, మొక్కల పెంపకంపై ఆయనకు వివరించారు. అనంతరం కేంద్రంలోని నర్సరీ బ్లాకులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

సమైక్యతతో భారత్ విశ్వగురువు

తిరుపతి సిటీ: భారత్‌ను విశ్వగురువు చేయడానికి అవసరమైన సమైక్యత సమృద్ధిగా ఉందని ఎస్వీయూ కులపతి ప్రొఫెసర్ కె.రాజారెడ్డి పేర్కొన్నారు. గురువారం శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనేట్ హాల్లో గురువారం ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ భారత్ యాజ్ విశ్వ గురు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ ఉపకులపతి ప్రొఫెసర్ శాంతిశ్రీ పండిట్ ముఖ్య వక్తగా, ఏబీఆర్‌ఎస్‌ఎం జాతీయ సహ సంఘటన కార్యదర్శి శ్రీ గుంత లక్ష్మణ్, ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, ప్రొఫెసర్ ఎం రాజశేఖర్, డాక్టర్ ఎం పద్మావతమ్మ అతిథులుగా పాల్గొన్నారు. తిరుపతిలోని జాతీయ, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, డిగ్రీ కళాశాలలో, ఇంటర్మీడియట్ కళాశాల అధ్యాపకులు, తిరుపతిలోని విద్యావంతులు పాల్గొన్నారు.

ఒయాసిస్‌లో తల్లులకు ఘన సత్కారం



తల్లులను సత్కరిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష, ఒయాసిస్ వైద్యులు

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్‌రోడ్డులోని ఒయాసిస్ ఫెర్టిలిటీలో అధునాతన సంతానోత్పత్తి చికిత్సలతో ఐవీఎఫ్ ద్వారా గర్భం దాల్చిన తల్లులను ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమానికి మేయర్ డాక్టర్ శిరీష ముఖ్య అతిథిగా హాజరై తల్లులను సత్కరించారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ జాహ్నవి మాట్లాడుతూ దంపతులు సంతానం పొందడానికి అనేక చికిత్సలు ఉన్నాయని, అయితే దీనిపై అవగాహన లేక ఆశలు వదులుకుంటున్నారని తెలిపారు. పీజీటీ వంటి అధునాతన టెక్నాలజీతో ఐవీఎఫ్‌లో సక్సెస్ రేటును మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ సంధ్యా, డాక్టర్ భారతి, ఒయాసిస్ ఫెర్టిలిటీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్, నేరాల నివారణపై అవగాహన

తిరుపతి కల్చరల్: బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా మూడో రోజు గురువారం మంగళంలోని బాలల గృహ సముదాయంలో డ్రగ్స్ నివారణ, నేరాల నివారణ వంటి అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి దిశ పోలీస్‌స్టేషన్ డెప్యూటీ ఎస్పీ బి.కాటమరాజు హాజరై డ్రగ్స్‌తో కలిగే నష్టాలు, నేర చరిత భవిష్యత్తుపై చూపే ప్రభావాలను గురించి తెలియజేసి, డ్రగ్స్ మానాలని, నేరాలను నివారించాలని కోరారు. శ్వేత హాస్పిటల్స్ డాక్టర్ ఏఆర్.రెడ్డి, డాక్టర్ రెడ్డెప్ప, బాలల గృహం సూపరింటెండెంట్స్ ఎం.షణ్ముఖరావు, కె.సుధాకర్, డెప్యూటీ సూపరింటెండెంట్ ఎన్ త్రినాథ్ రావు, బి.మోహన్‌బాబు, జి.లక్ష్మీపతి, వి.శ్రీధర్, డాక్టర్ దానవేంద్రరెడ్డి పాల్గొన్నారు.